సాక్షి వనపర్తి

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



..9,80,851 మహిళలు

రీజియన్ పరిధిలోని బస్సుల్లో 5 రోజుల్లో 9,80,851 మంది మహిళలు ప్రయాణించారు.

వివరాలు 8లో ▸



జాతీయస్థాయిలో రాణించాలి

క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయస్థాయిలో రాణించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ కోరారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /18.7

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడుప్పుడు చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జిల్లా ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా శ్రీరామ్



వనపర్తి: భూ రికార్డులు, కొలతల జిల్లా ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా శ్రీరామ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు పనిచేసిన జిల్లా సర్వేయర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో మహబూబ్‌నగర్ సర్వేయర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ తేజస్ పవార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉపకార వేతనాలకు నెలాఖరు చివరి గడువు

వనపర్తిటౌన్: వివిధ కళాశాలల్లో చదువుతున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఉపకార వేతనాల రిజిస్ట్రేషన్ ఈ–పాస్ ద్వారా ఫ్రెష్, రెన్యూవల్ చేసుకునేందుకు నెలాఖరు వరకు గడువు ఉందని షెడ్యూల్డ్ కులాల అధికారి ఏ.నుషిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫ్రెష్ విద్యార్థులు ఆధార్ బయోమెట్రిక్ సరిచూసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



పెబ్బేరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా నోడల్ అధికారి సి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, తరగతి గదిలో విద్యార్థులతో పాఠాలు చదివించి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జి.చిన్నరాములు, జి.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 9959226295 నంబర్‌కు తెలియజేయాలని ఆమె సూచించారు.

మరో అవకాశం..

ఓటరు నమోదుకు మరో చాన్స్ ఇచ్చిన ఈసీ



- తప్పులకు ఆస్కారం లేకుండా చర్యలు
- పకడ్బందీగా ఓటరు జాబితాల రూపకల్పన
- కసరత్తు ప్రారంభించిన అధికార యంత్రాంగం
- స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్‌ఎస్‌ఆర్)–2024 షెడ్యూల్ ఖరారు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ అచ్చంపేట/ మద్దూరు: ఓటరు నమోదుకు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. రాష్ట్రంలో త్వరలోనే గ్రామ పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలు రానుండటంతో ఎన్నికల సంఘం సదరు ప్రక్రియను ముమ్మరం చేసింది. అయితే ఏటా ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ ప్రకటిస్తుండగా.. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలుమార్లు అవకాశం ఇచ్చింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి.. అక్టోబర్‌లో తుది జాబితా ప్రకటించగా నవంబర్ రెండో వారంలో అనుసంధాన జాబితా ఇచ్చింది. దాని ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు.

జనవరి 5 వరకు గడువు

ఎన్నిలక సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి ఓటరు జాబితా సవరణ చేపట్టనున్నారు. బూత్ లెవల్ అధికారి (బీఎల్వో) మళ్లీ ఇంటింటికి తిరిగి కొత్త దరఖాస్తుతోపాటు మార్పులు, చేర్పులు, సవరణలుంటే వివరాలు సేకరిస్తారు. ఈ ప్రక్రియ వచ్చే జనవరి 5 వరకు చేపట్టనున్నారు. అదే నెల 6న ముసాయిదా జాబితా ప్రకటించి.. దీనిపై 22 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. వీటిపై బీఎల్‌ఓలు మారోసారి సర్వే చేపట్టి పరిష్కరిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి 2న జాబితా పరిశీలన, అదే నెల 8న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

వచ్చే నెల ఒకటి ప్రామాణికం..

జాబితాలో పేరు లేనివారు కొత్త దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చేనెల 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులని ఎన్నికల సంఘం పేర్కొంది. వీరు సీఈఓ వెబ్‌సైట్‌లో గాని, స్థానికంగా ఉండే బీఎల్‌ఓల వద్ద గాని ఫారం– 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిబవరి ఇచ్చే తుది జాబితాలో పేరుంటే లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

ప్రత్యేక క్యాంపెయిన్

పోలింగ్ బూత్ స్థాయిలో ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. శని, ఆదివారాలు ప్రత్యేకంగా కార్యక్రమం జరగనుండగా.. ఎన్నికల సంఘం త్వరలోనే తేదీలను ప్రకటించనుందని అధికారులు చెబుతున్నారు. స్థానికంగా ఉండేవారు కొత్తగా నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం దరఖాస్తులను బీఎల్వోలకు అందించాల్సి ఉంటుంది.

ప్రచారం కల్పిస్తున్నా..

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ వెలకట్టలేనిది. ఓటు అనే బ్రహ్మస్త్రంతో భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునే అవకాశముంది. అయితే అర్హులైన వారు ఓటుహక్కు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం చేస్తున్నా పలువురు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా ఎన్నికల కమిషన్ కల్పిస్తున్న అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

నియోజకవర్గాల వారీగా..

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం జిల్లాలో 31,35,060 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో నియోజకవర్గాల వారిగా పరిశీలిస్తే.. నాగర్‌కర్నూల్‌లో 2,32,780 మంది, అచ్చంపేటలో 2,42,129, కొల్లాపూర్‌లో 2,34,167, కల్వకుర్తిలో 2,41,762, వనపర్తిలో 2,71,151, నారాయణపేటలో 2,31,896, కొడంగల్‌లో 2,36,625, మక్తల్‌లో 2,42,254, దేవరకద్రలో 2,35,154, గద్వాలలో 2,56,605, అలంపూర్‌లో 2,37,938, మహబూబ్‌నగర్‌లో 2,52,355, జడ్చర్లలో 2,20,244 మంది ఓటర్లు ఉన్నారు.

నమోదు చేసుకోవాలి



కేంద్ర ఎన్నికల సంఘం 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. సీఈఓ వెబ్‌సైట్‌లో గాని, బీఎల్‌ఓ వద్ద గాని ఫారం– 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఫిబవరిలో తుది జాబితా విడుదల చేస్తారు. ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో పేర్లను సరిచూసుకోవాలి.

– గోపిరాం, ఆర్డీఓ, అచ్చంపేట

ఓటు హక్కు నమోదు ఇలా..

- 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- వయస్సు నిర్ధారణ, చిరునామా ధ్రువపత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతచేయాలి
- ఆన్‌లైన్‌లోనూ సీఈఓ వెబ్‌సైట్, బీఎల్‌ఓల వద్ద నమోదు చేసుకోవచ్చు
- కొత్తగా ఓటు నమోదుకు ఫారం- 6
- ఓటు బదిలీ, తొలగింపునకు ఫారం- 7
- చిరునామా, పేరు, పుట్టిన తేదీల్లో మార్పులకు ఫారం- 8
- నియోజకవర్గ పరిధిలోనే ఓటు బదిలీకి ఫారం- 8ఏ
- మీ సేవా కేంద్రాల్లో లేదా స్వయంగా ఆన్‌లైన్‌లో www.nvsp.in ద్వారానైనా లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ceotelangana.nic.in లో గాని దరఖాస్తు చేసుకోవచ్చు.

షెడ్యూల్ వివరాలు ఇలా..

కొత్త ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ: 20 నుంచి జనవరి 5 వరకు..

ముసాయిదా జాబితా : జనవరి, 6, 2024

మార్పులు, చేర్పులకు అభ్యంతరాల స్వీకరణ : జనవరి 6 - 22, 2024 (ఏదైనా ఒక శని, ఆదివారం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి)

అభ్యంతరాలు, క్లెయిమ్స్ పరిష్కరించాల్సిన గడువు : ఫిబ్రవరి 2, 2024

ఓటర్ల తుది జాబితా ప్రకటన : ఫిబ్రవరి 8, 2024

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- డీపీఓ సురేష్‌కుమార్



మాట్లాడుతున్న డీపీఓ సురేష్‌కుమార్

ఆత్మకూర్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని.. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా పంచాయతి అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉండగా.. పోలింగ్ నిర్వహణకు సంబంధించి పూర్తి వివరాలను టీపోల్‌లో పొందుపర్చామని, రిజర్వేషన్ల మార్పుపై స్పష్టత రావాల్సి ఉందని తెలిపారు. మొత్తం 2,348 వార్డులు ఉన్నాయని.. వార్డుకు ఒక బూత్ చొప్పున ఒక్కోబూత్‌లో 200 ఓటర్ల వరకు ఇద్దరు అధికారులు, 400పైగా ఉంటే ముగ్గురు అధికారులను నియమిస్తామని వివరించారు. ప్రస్తుత సర్పంచ్‌ల కాలపరిమితి 2024, జనవరి చివరి నాటికి ముగియనుందని తెలిపారు. పూర్తి విధివిధానాలు రావాలసి ఉందన్నారు.

అంతర్జాతీయ క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు



హైదరాబాద్‌లో క్రీడాకారులతో కోచ్ ఉమాశంకర్

పెబ్బేరు రూరల్: నేపాల్ రాజధాని ఖట్మండులో ఈ నెల 7 నుంచి 11 వరకు జరిగిన అంతర్జాతీయ టార్గెట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించినట్లు కోచ్ ఉమాశంకర్ తెలిపారు. భారత జట్టులో తెలంగాణ నుంచి 9 మంది పాల్గొనగా అందులో జిల్లాకు చెందిన అయిదుగురు క్రీడాకారులు ఉన్నారని.. సీనియర్ విభాగంలో జిల్లాకు చెందిన వంశీ బంగారు పతకం, జూనియర్ బాలుర విభాగంలో లోకేష్, గౌతమ్ రజత పతకాలు సాధించినట్లు వివరించారు. సీనియర్ విభాగంలో వంశీకి, జూనియర్ బాలికల విభాగంలో పూజకి బెస్ట్ షూటర్ అవార్డులు లభించాయని తెలిపారు. భారత జట్టుకు కోచ్‌గా వ్యవహరించేందుకు అవకాశం కల్పించిన తెలంగాణ టార్గెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రేవంత్, అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, కార్యవర్గసభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులను వనపర్తి అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహ, వెంకటేష్ అభినందించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



కౌన్సిలర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎవరూ అధైర్యపడొద్దని.. మీ వెంటే ఉంటానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో పుర కౌన్సిలర్లతో సమావేశమై మాట్లాడారు. తనతో పాటు ఉండి తన కోసం పనిచేసిన నాయకులను కాపాడుకుంటానని.. రానున్న రోజుల్లో మనకున్న అధికారాలతో ప్రజలకు సేవచేసి వారి విశ్వాసం పొందేందుకు ప్రయత్నిద్దామని సూచించారు. స్థానిక సంస్థల పాలకులు ఎవరి వత్తిడులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్న, జంపన్న, బాషానాయక్, మహేష్, నాయకులు శ్యాంకుమార్, శరవంత, శేఖర్, రమేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంటల మార్పిడిని ప్రోత్సహించాం..

పెబ్బేరు రూరల్: రాష్ట్రంలో పంటల మార్పిడిని ప్రోత్సహించామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డితో కలిసి వనపర్తి మండలం చిట్యాల సమీపంలో ఉన్న రైతు ముష్టి బాలీశ్వర్ సాగుచేసిన ఆయిల్‌పాం తోటను పరిశీలించారు. ఏపుగా పెరిగిన మొక్కలు, అంతరపంటగా సాగు చేసిన వేరుశనగను చూసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 14 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగుచేశారని.. 2 లక్షల ఎకరాల సాగుతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలవనుందని వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

కోయిల్‌సాగర్ నీటిని విడుదల చేయాలి



హైదరాబాద్ జలసౌధలో ఈఎన్‌సీతో ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి

దేవరకద్ర: కోయిల్‌సాగర్ నీటిని యాసంగి పంటలకు విడుదల చేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో తెలంగాణ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌ని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో 32.6 అడుగుల మేర నీటి నిల్వ ఉందని, యాసంగి పంటలకు నీటిని వదలాలని విన్నవించారు. వేసవిలో తాగునీటి అవసరాలకు నీరు కావాల్సి వస్తే జూరాల నుంచి ఎత్తిపోతల ద్వారా ఒక టీఎంసీ నీటిని కోయిల్‌సాగర్‌కు తరలించి తాగునీటిని అందించవచ్చని సూచించారు. ఈ మేరకు నీటిని ఎలా వదలాలనే విషయమై జిల్లాస్థాయిలో ఐఏబీ సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపారు.

ఈఎన్‌సీ సానుకూల స్పందన

నీటి విడుదల విషయంలో ఈఎన్‌సీ సానుకూలంగా స్పందించారని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. త్వరలో ఐఏబీ సమావేశం నిర్వహించి నీటి విడుదల షెడ్యూల్ ఖరారు చేసే అవకాశం ఉందన్నారు. ఈ నెల చివరి వారం ప్రారంభంలోనే నీటిని వదలడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అయితే జూరాల నుంచి అదనంగా నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించడానికి ఈఎన్‌సీ సమ్మతించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామన్నారు.

వెట్టిచాకిరితో బాల్యాన్ని బంధించొద్దు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న అంజత్, విద్యార్థులు

వనపర్తి: అందమైన బాల్యాన్ని వెట్టిచాకిరీ చేయిస్తూ బంధించొద్దని మానవ అక్రమ రవాణా నిరోధక అధికారి, ఎస్‌ఐ అంజత్ కోరారు. ఎస్పీ ఆదేశానుసారం గురువారం స్థానిక కాకతీయ పాఠశాలలో ఈవ్‌టీజింగ్, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 14 ఏళ్ల లోపు చిన్నారులతో ఎవరైనా బలవంతంగా పనులు చేయిస్తే బాలకార్మిక చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని, ఇంటి పనులకు చిన్నారులను పెట్టుకోవటం నేరంగా పరిగణిస్తామన్నారు. బడిఈడు పిల్లలు పనులు చేస్తున్నట్లు మీ దృష్టికి వస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1098కి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆపద సమయంలో డయల్ 100కు కాల్ చేస్తే పోలీసులు సాయం చేసేందుకు వస్తారని తెలిపారు. ఆకతాయిలు వేధిస్తే మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 1091, 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, 112, సైబర్ క్రైమ్ 1930 నంబర్లకు ఫోన్‌గానీ, వాట్సాప్ ద్వారాగాని ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జోడు పదవుల జోరు

- తండ్రి పెద్దల సభకు, తనయుడు శాసనసభకు
- ఎమ్మెల్సీగా కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజేష్‌రెడ్డి
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిన తండ్రి
- పోటీచేసిన మొదటిసారే గెలిచిన తనయుడు



కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి



కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: సుమారు నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదుసార్లు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. ఓటమి చెందినా.. గెలుపు అంచుల్లోకి వెళ్లి చేజారినా.. ప్రజాక్షేత్రంలోనే కొనసాగిన కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కాలక్రమంలో సర్పంచ్ నుంచి ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగారు. తండ్రి కలను నెరవేరుస్తూ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన తనయుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఒకే ఇంటి నుంచి తండ్రి ఎమ్మెల్సీగా పెద్దల సభకు, కుమారుడు ఎమ్మెల్యేగా శాసనసభకు వెళ్లడంతో కూచుకుళ్ల అనుచరవర్గాల్లో ఆనందం నెలకొంది.

సర్పంచ్ నుంచి ఎమ్మెల్సీ..

కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి 1980లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతూ కాంగ్రెస్‌లో చేరారు. తూడుకుర్తి గ్రామ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన దామోదర్‌రెడ్డి ఎంపీపీగా, నాగర్‌కర్నూల్ బ్లాక్ వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్రుడిగా బరిలో దిగి ఓటమిచెందారు. తర్వాత మరో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 2006లో జెడ్పీటీసీగా గెలుపొంది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గానూ సేవలందించారు. 2015లో నిర్వహించిన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్సీగా గెలుపొందారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి 2021లో రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

రాజకీయ అరంగేట్రంతోనే..

తండ్రి వారసత్వంగా రాజకీయాల్లో వచ్చిన ఆయన కుమారుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి రాజకీయ అరంగేట్రంతోనే విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా నెరవేరని తండ్రి కలను తనయుడు నెరవేర్చారు. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు ఆగస్టు 3న కాంగ్రెస్ పార్టీలో చేరిన కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు.

డిగ్రీ పరీక్షలో గందరగోళం

- పాత సిలబస్ నుంచి ప్రశ్నలు రావడంతో విద్యార్థుల అయోమయం
- ఆలస్యంగా గుర్తింపు.. ప్రశ్నపత్రాలు వెనక్కి
- 45 నిమిషాల తర్వాత మరో ప్రశ్నపత్రం అందజేత
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- పీయూ పరిధిలో గురువారం 11మంది విద్యార్థుల డీబార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో గురువారం 5వ సెమిస్టర్ ఇంగ్లిష్ పరీక్ష 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ విద్యా సంవత్సరం ఆంగ్లం సబ్జెక్టులో చాలా వరకు మార్పులు చోటు చేసుకున్నాయి. అయితే పాత సిలబస్ నుంచి ప్రశ్నలు రాగా.. పలు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఈ విషయాన్ని ఆయా ఎగ్జామినర్ల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ప్రశ్నపత్రాలను అధికారులు వెనక్కి తీసుకుని 45 నిమిషాల తర్వాత తిరిగి కొత్త ప్రశ్నపత్రాలను ఇచ్చారు. దీంతో ఉదయం 9.30గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్ష ఉదయం 10.15 గంటలకు ప్రారంభమైనట్లు విద్యార్థులు పేర్కొన్నారు. కొన్ని చోట్ల మరింత ఆలస్యమైనట్లు తెలుస్తోంది. మార్చిన ప్రశ్నపత్రాలను అధికారులు ఆన్‌లైన్ ద్వారా పంపించగా వెంటనే ప్రింట్ తీయించిన ఎగ్జామినర్లు విద్యార్థులకు ఇచ్చారు. ఎంతో కీలకమైన పరీక్షల్లో పీయూ పరీక్షల విభాగం అధికారులు నిర్లక్ష్యం వహించడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

అనుభవం లేనివారికి బాధ్యతలు..

యూనివర్సిటీ మొత్తంలో ఎగ్జామినేషన్ విభాగం ఎంతో కీలమైంది. ఇంత కీలకమైన బాధ్యతలను యూనివర్సిటీ అధికారులు సీనియర్, గతంలో పని చేసిన అనుభవం ఉన్న వారిని నియమించాల్సి ఉంది. కానీ గతంలో అడిషనల్ కంట్రోలర్ బాధ్యతలు నిర్వహించిన అధికారులు ప్రస్తుతం కంట్రోలర్‌గా ఉన్నారు. ఆయన ఢిల్లీ వెళ్లడంతో.. పరీక్ష నిర్వహణ బాధ్యతలు ఎలాంటి అనుభవం లేని ఓ అధికారిణికి అప్పగించినట్లు సమాచారం. దీంతో పరీక్షల నిర్వహణలో తప్పులు దొర్లినట్లు పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. వీసీ వెంటనే స్పందించి అర్హత, అవగాహన కలిగిన వ్యక్తులకు బాధ్యతలు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

➪ ఈ విషయంపై ఇన్‌చార్జ్‌గా ఉన్న అధికారిణిని ఫోన్‌లో సంప్రదించగా.. పరీక్షల్లో ఎలాంటి లోటుపాట్లు జరగలేదని, ఎవరికీ ఇబ్బందులు లేవని.. ప్రశాంతంగా జరిగిందని చెప్పడం గమనార్హం.

48 పరీక్ష కేంద్రాల్లో 11 మంది డీబార్

పీయూ పరిధిలో 48 పరీక్ష కేంద్రాల్లో జరిగిన గురువారం జరిగిన పరీక్షల్లో మొత్తం 11 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. ఈ మేరకు 5వ సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 10,921 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 10,626 మంది హాజరయ్యారు. మరో 290 మంది గైర్హాజరు కాగా ఐదుగురు చూచిరాతలకు పాల్పడుతుండగా వారిని డీబార్ చేశారు. వీరితో పాటు 1వ సెమిస్టర్‌లో 13,234 మంది విద్యార్థులకు 12,430 మంది హాజరయ్యారు. 798 మంది గైర్హాజరు కాగా.. మరో ఆరుగురు చూచిరాతలకు పాల్పడగా అధికారులు వారిని డీబార్ చేశారు.



స్క్వాడ్ అధికారులకు సూచనలిస్తున్న వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

ప్రశ్నపత్రం మార్చి ఇచ్చాం..

గురువారం జరిగిన 5వ సెమిస్టర్ ఇంగ్లీష్ పరీక్షలో కొన్ని పాతప్రశ్నలు రాగా.. లోపాన్ని గుర్తించి వెంటనే ప్రశ్నపత్రాన్ని మార్చి ఇచ్చాం. దీంతో పరీక్ష 25 నిమిషాలు ఆలస్యం అయ్యింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

– రాజ్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్

క్లుప్తంగా

వరికోత మిషన్‌ కింద పడి రైతు మృతి


నర్సింహ(ఫైల్)

వనపర్తి: చిన్నంబావి మండలంలోని మియాపూర్‌కు చెందిన ముడావత్‌ నర్సింహ(45) వరికోత మిషన్‌ కింద పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తన వ్యవసాయ పొలానికి వరికోత మిషన్‌ను తీసుకెళ్తూ ప్రమాదవశాత్తు మిషన్‌ కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరి దుర్మరణం

భూత్పూర్‌: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతిచెందగా.. ఇద్దరు గాయపడ్డారు. ప్రత్యక్షుల కథనం మేరకు.. భూత్పూర్‌ నుంచి మహబూబ్‌నగర్‌ వైపు వెళ్తున్న జయన్న, హరిజన్‌ ప్రకాష్‌ బైక్‌ను భూత్పూర్‌కు వస్తున్న సుక్యా (25) బైక్‌ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని ఎంపీడీఓ మున్సీ, అటెండర్‌ రాజేష్‌ ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ సుక్యా మృతిచెందగా.. హరిజన్‌ ప్రకాష్‌ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కారు ఢీకొని మరొకరు..

కొత్తకోట రూరల్‌: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందిన ఘటన కొత్తకోట మండలం నాటవెల్లి సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం నుంచి కల్వకుర్తికి గడ్డి విత్తనాల లోడ్‌తో వెళ్తున్న లారీలో సత్యసాయి జిల్లా గంగవరం మండలం బెలుగప్పకు చెందిన ఇస్మాయిల్‌ (45) ప్రయాణిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు నాటవెల్లి సమీపంలో ఉన్న ఓ దాబా దగ్గర లారీ నిలిపి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్‌ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఇస్మాయిల్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇస్మాయిల్‌ అల్లుడు మగ్బూల్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కల్వకుర్తి టౌన్‌: పట్టణంలోని బస్టాండ్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్‌ వివరాల మేరకు.. ఊర్కొండ మండలం రాంరెడ్డిపల్లికి చెందిన ఓ వివాహితతో కలిసి ఉప్పునుంతల మండలం మొల్గరకు చెందిన సైదులు (41) కొన్నేళ్లుగా పట్టణంలో నివాసమంటున్నాడు. సైదులు మేస్త్రీ పని చేస్తుండగా, ఆమె కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మూడు రోజులుగా సైదులు బస్టాండ్‌లోనే ఉంటున్నాడు. గురువారం అపస్మారక స్థితిలోకి చేరగా.. బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భార్య హుస్సేనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లభించని గుర్తుతెలియని వ్యక్తి వివరాలు

ఆత్మకూర్‌: ఆత్మకూర్‌ పట్టణంలో మూడు రోజుల కిందట మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తికి సంబంధించి ఎలాంటి వివరాలు లభించలేదని ఎస్‌ఐ నరేందర్‌ తెలిపారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం చేయించి మున్సిపాలిటీకి అప్పగిస్తామని పేర్కొన్నారు. సుమారు 50 ఏళ్ల వయసు గల వ్యక్తి స్థానిక సాయివెంకటేశ్వర సప్లయర్స్‌ ఎదుట సోమవారం రాత్రి మృతి చెందాడని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, వివరాలు తెలిస్తే సీఐ 8712670630 లేదా ఎస్‌ఐ 8712670631 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

పెబ్బేరు రూరల్‌: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మునుగమోనిదిన్నెలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీశ్వర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జనుపల్లి అనుబంధ గ్రామం మునుగమోనిదిన్నెకు చెందిన కేశపాగ బాలకృష్ణ(42) భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇతని భార్య రెండేళ్ల నుంచి దూరం ఉండడం తట్టుకోలేక మద్యానికి బానిసై పలు సార్లు తాను చచ్చిపోతాను అని ఇంట్లో వారితో అంటుండేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. అతను గురువారం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి పెంటన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇరుముడి కట్టి.. శబరిమలైకి..

8 ఏళ్లుగా అచ్చంపేట అయ్యప్ప భక్తుల పాదయాత్ర
- 18 మంది బృందం.. 35 రోజులు.. 1050 కి.మీ.
- రోజుకు 35 కిలోమీటర్లు..
- ప్రశంసిస్తున్న భక్తజనం


అటవీ మార్గంలో అయ్యప్ప మాలధారుల పాదయాత్ర

అచ్చంపేట రూరల్‌: ఒంటిపై నల్లటి దుస్తులు ధరించి కాళ్లకు చెప్పులు లేకుండా ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. చలికి వణుకుతూ వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ శబరిమలకు చేరుకుంటున్నారు నాగర్‌కర్నూల్‌ జిల్లా అచ్చంపేటకు చెందిన అయ్యప్ప భక్తులు. దైవచింతనతో చేసే ఈ మహా పాదయాత్రకు 8 ఏళ్ల చరిత్ర ఉంది.

28 ఏళ్ల కిందట..

అచ్చంపేటకు చెందిన పదునెట్టాంబడి ఆశ్రమ అయ్యప్ప భక్తులు 28 ఏళ్లుగా మాల ధరిస్తున్నారు. వారిలో గురుస్వాములు శ్రీనివాసులు, జగదీష్‌, హుస్సేన్‌, మురళి, రఘురాం, రమేష్‌గౌడ్‌, వెంకటరమణ, రవి, శ్రీనివాసులు, రమేష్‌(రింగు), శ్రీనివాసులు, ప్రశాంత్‌, శ్రీధర్‌, రమేష్‌రావు, వనం శ్రీను, బాలరాజు, గణేష్‌, శివ, కేతేపల్లి శివ, సాయికిరణ్‌, శివ, కృపాకర్‌, లింగం తదితరులు ఉన్నారు. వీరంతా అచ్చంపేట నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్లాలని నిర్ణయించుకొని అనుకున్నదే తడవుగా 18 మంది మాలధారులు 2014లో పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. మొదటిసారి కొన్ని ఆటంకాలు ఎదురైనా గురుస్వాముల సూచనలు, సలహాల మేరకు ముందుకు సాగారు. ఏటా నవంబర్‌లో పాదయాత్ర చేపడతారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు రావడంతో డిసెంబర్‌ 14న ప్రారంభించారు. కరోనా సమయంలో ఒక ఏడాది పాదయాత్ర చేయలేదు.

స్వామియే శరణం అయ్యప్ప అంటూ..

స్వామియే శరణం అయ్యప్ప అంటూ ఉన్న చోటు నుంచే స్వామికి పూజలు చేస్తారు. అచ్చంపేటతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు చాలా ఏళ్లుగా పాదయాత్ర చేపడుతున్నారు. ఏటా కార్తీక మాసం ప్రారంభంలో స్వామి మాల ధరించి వారం, పదిరోజుల తర్వాత సన్నిధానం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తారు. మార్గమధ్యంలో ఎక్కడ చీకటైతే అక్కడ ఉన్న ఆలయాన్ని ఎంచుకొని అక్కడే నిద్రిస్తారు. కావాల్సిన సరుకులు వెంట తెచ్చుకొని తమ వంట తామే చేసుకుంటూ పాదయాత్ర కొనసాగిస్తారు. వీలులేని పక్షంలో స్వాముల కోసం ప్రత్యేక భోజనం అందించే హోటళ్లలో భిక్ష చేసి యాత్రను కొనసాగిస్తారు.

ప్రణాళికతో ముందుకు..

అచ్చంపేట నుంచి శబరిమలకు సుమారు 1,050 కిలోమీటర్ల దూరం ఉంది. రోజు 35 కిలోమీటర్ల చొప్పున నడిచేలా ప్రణాళిక చేసుకుంటారు. 35 రోజుల్లో 1,050 కిలోమీటర్లు చేరుకొని శబరిమలలో అయ్యప్పస్వామిని దర్శించుకుంటారు. అచ్చంపేట నుంచి నాగర్‌కర్నూల్‌, వనపర్తి, కర్నూలు, అనంతపూర్‌, డోన్‌, గుత్తి, బెంగళూరు, సేలం, తేని, కుమిలి, శబరిమలకు కొండలు, కోనలు, వాగులు, వంకలు, అడవులు దాటుకుంటూ కాలిబాట, రోడ్డుమార్గాన చేరుకుంటారు. రాత్రి, పగలు తేడా లేకుండా అలసట వచ్చే దాకా పాదయాత్ర చేస్తూనే ఉంటారు. చీకట్లోనూ తలకు టార్చిలైట్‌, రెడ్‌ జాకెట్‌ ధరించి ముందుకు సాగుతుంటారు.


రోడ్డుపై రెడ్‌ జాకెట్‌ ధరించి..

23 సార్లు మాల ధరించా..



ఏటా పదునెట్టాంబడి ఆశ్రమంలో మాల ధరిస్తున్నాం. ఇప్పటికి 23 సార్లు మాల ధరించి 8వ సారి పాదయాత్ర చేస్తున్నా. మొదట్లో ఇబ్బంది కలిగినా యాత్ర కొనసాగించాం. ప్రతిసారి 18 మంది బృందంతో పాదయాత్ర చేస్తున్నాం.
– దమ్మొ మురళి, గురుస్వామి, అచ్చంపేట

కోర్కెలు నెరవేరుతున్నాయి..



భక్తితో ఎంత దూరమైన పాదయాత్ర చేయవచ్చు. పాదయాత్రగా అయ్యప్పను దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతున్నాయి. చలిని కూడా లెక్క చేయకుండా 35 రోజుల పాటు రాత్రి, పగలు పాదయాత్ర చేస్తాం.
– హుస్సేన్‌, గురుస్వామి, అచ్చంపేట

అటవీ మార్గంలో..



సుమారు 1,050 కిలోమీటర్ల దూరంలో ఉన్న శబరిమలకు అయ్యప్ప శరణు ఘోషతో అడవులు దాటుకుంటూ ముందుకు సాగుతాం. కాళ్లకు చెప్పులు లేకుండానే వాగులు, వంకలు, కొండలు, కోనలు దాటుతాం.
– రమేష్‌గౌడ్‌, గురుస్వామి, అచ్చంపేట

మొదట్లో భయమేసినా..



ప్రతి ఏటా అయ్యప్ప మాలలు ధరిస్తాం. వెయ్యి కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేయడం చాలా గొప్ప విషయం. మొదట్లో కాస్త భయమేసినా ప్రస్తుతం పాదయాత్ర చేయడం సులభమైంది. అలసట వచ్చిన చోటనే సేద తీరుతాం. అక్కడే పూజలు, భిక్ష చేసుకుంటాం.
– భానుప్రసాద్‌, గురుస్వామి, అచ్చంపేట

అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం


ముదిరెడ్డిపల్లి శివారులో ట్రాక్టర్‌లోనే కృత్రిమ ఇసుక తయారీ

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాలతో అధికారుల అప్రమత్తం

రాజాపూర్‌: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు. జడ్చర్ల ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తానని బహిరంగంగా హామీ ఇచ్చారు. దీంతో పాటు ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో గురువారం మండలంలోని ముదిరెడ్డిపల్లి, తిర్మలాపూర్‌, చెన్నవెల్లి శివార్లలో రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు దాడులు నిర్వహించి రాజాపూర్‌ శివారులో ఓ ఇసుక డంప్‌ను సీజ్‌ చేశారు. తిర్మలాపూర్‌ చెందిన ఇసుక ఫిల్టర్‌ వద్ద పట్టపగలే కృత్రిమ ఇసుక తయారు చేస్తుండగా ఆర్‌ఐ ఖదీర్‌ మూడు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. తిర్మలాపూర్‌, చెన్నవెల్లి, దొండ్లపల్లి, ముదిరెడ్డిపల్లి, మల్లేపల్లి, ఈద్గాన్‌పల్లి, నందిగామలో కొన్నేళ్లుగా ఇసుక రవాణా నిషేధం ఉన్నా, ఇసుక మాఫియా పగలు, రాత్రి ఫిల్టర్‌లను ఏర్పాటు చేసుకుని మట్టిని తోడేసి కృత్రిమ ఇసుకను తయారు చేస్తూ టిప్పర్లలో పట్టణాలకు తరలిస్తున్నారు.

అడపాదడపా కేసులు

మండల శివారులో ఉన్న ఈ దుందుబీవాగులో ఇసుకను తోడేయడంతో సమీప పొలాల రైతులు తమ వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు అడుగంటుకుపోయాయి. దీంతో రైతులు వ్యవసాయం చేసేందుకు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డ వారి వాహనాలు అప్పుడప్పుడు అధికారులు పట్టుకుని కేసులు నమోదు నమోదు చేయడంతో పాటు జరిమానాలు వేశారు. వేసినా అది రెండు, మూడురోజులు మాత్రమే. తిరిగి వారి వ్యాపారం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

ఎక్కడ చూసిన గుంతలే..

వాగు పరిస రప్రాంతాల్లో మట్టిని తోడేయడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాజాపూర్‌లో ఓ వర్గాకు చెందిన వారు వాగు మధ్యలో ఉన్న ఓ గడ్డపై తమ వారు ఎవరైన చనిపోతే అక్కడే అంత క్రియలు నిర్వహించేశారు. అక్కడ సమాధుల చుట్టూ మట్టి తీయడంతో అవి కూడా మట్టిలో కలిసిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..



ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారైన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా గుర్తిస్తే వెంటనే తమ సిబ్బందికాని సమాచారం ఇస్తే, వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.
– విద్యాసాగర్‌రెడ్డి, తహసీల్దార్‌, రాజాపూర్‌

విద్యను నిర్లక్ష్యం చేస్తే పోరాటం



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

వనపర్తిటౌన్‌: ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసి ప్రైవేటీకరణపై దృష్టి సారిస్తే పోరాటాలు తప్పవని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ హెచ్చరించారు. గురువారం జిల్లాకేంద్రంలోని యాదవ భవనంలో పీడీఎస్‌యూ జిల్లా మాజీ అధ్యక్షుడు గణేష్‌ అధ్యక్షతన జరిగిన జిల్లా జనరల్‌ కౌన్సిల్‌ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అవేవి నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాలతో ఆడుకున్న బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు ఓడించారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్‌, మెస్‌ ఛార్జీలు సకాలంలో చెల్లించకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి ఆజాద్‌, సీపీఐ (ఎంఎల్‌) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి హన్మంతు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యార్థులు లేరని వందల సంఖ్యలో స్కూళ్లను మూసివేసిందని.. ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయకుండా, మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థుల పేరుతో పాఠశాలలు మూసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌, జిల్లా కోశాధికారి సి.రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని సైతం అర్థం చేసుకోవాలని, మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం..

అధ్యక్షుడిగా వెంకటేష్‌, కార్యదర్శిగా రమేష్‌, కోశాధికారిగా గణేష్‌, సభ్యులుగా గౌతమ్‌, విజయ్‌, మోహన్‌, వెంకటేష్‌, అశోక్‌, దీవెన, ఇద్దరు కో–ఆప్షన్‌ సభ్యులు మొత్తం 11 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌ తెలిపారు.

5 రోజులు.. 9,80,851 మహిళలు..


మహబూబ్‌నగర్‌ బస్టాండ్‌లో కిక్కిరిసిన మహిళా ప్రయాణికులు

- రీజియన్‌లో పెరుగుతున్న మహిళా ప్రయాణికుల సంఖ్య
- ప్రతినిత్యం 2 లక్షల మందికిపైగా రాకపోకలు
- నేటినుంచి టిమ్‌ ద్వారా జీరో టికెట్ల జారీ

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి మహబూబ్‌నగర్‌ రీజియన్‌లో విశేష స్పందన లభిస్తోంది. గడిచిన ఐదురోజుల్లో రీజియన్‌ పరిధిలో 9,80,851 మంది మహిళలు రాకపోకలు సాగించి.. సోమవారం నుంచి బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. రీజియన్‌లోని పది డిపోల్లో 467 పల్లె వెలుగు, 263 ఎక్స్‌ప్రెస్‌ బస్సుల్లో మహిళలు ప్రయాణించవచ్చు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌ బస్సులు మహిళలతో కిక్కిరిసిపోతున్నాయి. రీజియన్‌లో సాధారణ ప్రయాణికుల కంటే మహిళలే 60 శాతానికిపైగా ప్రయాణిస్తుండడం విశేషం. ముఖ్యంగా హైదరాబాద్‌ రూట్లోని బస్సుల్లో ఇటు సాధారణ ప్రయాణికులతోపాటు మహిళలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. మహబూబ్‌నగర్‌ ఆర్టీసీ రీజియన్‌లో తొలిరోజు 9వ తేదీ నాడు మహిళలు 75,600 మంది ప్రయాణించగా.. 11వ తేదీ నుంచి ఆ సంఖ్య 2 లక్షలకు పెరిగింది. అన్ని డిపోల్లో సాధారణ ప్రయాణికుల కంటే మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు కండక్టర్లు టిమ్‌ ద్వారా జీరో టికెట్లు జారీ చేయనున్నారు.

గుర్తింపు కార్డు చూపించాలి

గురువారం రాత్రి నుంచి టిమ్‌ మిషన్‌లో సాఫ్ట్‌వేర్‌ అప్‌లోడ్‌ అవుతుంది. శుక్రవారం ఉదయం మొదటి బస్సు నుంచి కండక్టర్లు టిమ్‌ ద్వారా మహిళలకు ఉచిత జీరో టికెట్లు జారీ చేస్తారు. మహిళలు కండక్టర్‌కు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూయించి జీరో టికెట్‌పై ప్రయాణం చేయవచ్చు.
– శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్‌ మేనేజర్‌, మహబూబ్‌నగర్‌

9 నుంచి 13 తేదీ వరకు రీజియన్‌లో ప్రయాణించిన వారు ఇలా..

తేదీ	పురుషులు	మహిళలు	మొత్తం
9	2,13,007	75,600	288607
10	1,49,738	1,76,506	3,26,244
11	1,59,077	2,56,106	4,15,183
12	1,40,840	2,23,600	3,64,440
13	1,39,394	2,49,039	3,88,433

చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి

మహబూబ్‌నగర్‌ న్యూటౌన్‌: కాంగ్రెస్‌ పార్టీ చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను తప్పకుండా అమలు చేయాలని ఆదివాసీ లంబాడ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ చైర్మన్‌ ఆర్‌.రఘునాయక్‌ డిమాండ్‌ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని పంతూనాయక్‌ గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రఘునాయక్‌ మాట్లాడుతూ ఎస్టీ కమిషన్‌ ఏర్పాటు చేయాలని, గిరిజన తండా గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా ప్రకటించాలని, లంబాడలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో భాగంగా ఎస్టీ రిజర్వేషన్‌ పెంపు, అంబేద్కర్‌ అభయ హస్తం ద్వారా రూ.12 లక్షల ఆర్థిక సహాయం, ప్రైవేటు రంగంలో ప్రత్యేక రిజర్వేషన్‌, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్‌ భూముల పునరుద్ధరణ, పోడు భూముల పంపిణీ వంటి పలు కార్యక్రమాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్‌ రవిరాథోడ్‌, కోఆర్డినేటర్‌ ఛత్రపతి, శ్రీనునాయక్‌, పురేందర్‌ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రఘునాయక్‌

సోలార్‌ ప్లాంట్‌ సమీపంలో అగ్నిప్రమాదం

కందనూలు: మండలంలోని గగ్గలపల్లి శివారు సోలార్‌ ప్లాంట్‌ సమీపంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గగ్గలపల్లి శివారులో ఉన్న సోలార్‌ ప్లాంట్‌ సమీపంలో ఎండుగడ్డి అంటుకొని అగ్నిప్రమాదం జరగడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులలకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో కాలిపోతున్న ఎండు గ్రాసాన్ని సకాలంలో ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది.

పాఠశాలలో ఫర్నీచర్‌ దగ్ధం

షార్ట్‌సర్క్యూట్‌తో పాత ఫర్నీచర్‌కు నిప్పంటుకున్న సంఘటన గురువారం జిల్లాకేంద్రంలోని నేషనల్‌ హైస్కూల్‌లో చోటుచేసుకుంది. ఫైర్‌ ఆఫీసర్‌ కృష్ణమూర్తి కథనం ప్రకారం.. నేషనల్‌ హైస్కూల్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో పాత ఫర్నిచర్‌కు నిప్పు అంటుకొని ప్రమాదం జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంటల వ్యాప్తిని గమనించిన స్థానికులు వెంటనే ఫైర్‌ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పిందని అగ్నిమాపక అధికారి తెలిపారు. ఇదే ఘటన ఉదయం వేల విద్యార్థులు ఉన్న సమయంలో జరిగి ఉంటే పెను ప్రమాదం వాటిల్లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

పిల్లలతో సహా వివాహిత అదృశ్యం



అచ్చంపేట రూరల్‌: అచ్చంపేట మండలంలోని గుంపన్‌పల్లికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైంది. పోలీసుల వివరాల మేరకు.. గుంపన్‌పల్లికి చెందిన జేమ్లాతో లక్ష్మికి పదేళ్ల కిందట వివాహమైంది. రెండు రోజుల కిందట భర్త, కుటుంబ సభ్యులతో ఆమె గొడవపడి కుమారుడు అన్వేష్‌, కూతురు అక్షితతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. లక్ష్మి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నారుమడి యాజమాన్య పద్ధతులు

పాడి-పంట
అధికారి సలహా: జాన్‌ సుధాకర్‌, డీఏఓ, నారాయణపేట

- మెళకువలతో అధిక దిగుబడి
- విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

కోస్గి: ప్రస్తుతం యాసంగి సీజన్‌ ప్రారంభం కావడంతో వరిసాగు చేసే రైతులు వరినారు పోసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పాటించాల్సిన నారుమడి యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధితో ప్రయోజనాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌ సుధాకర్‌ వివరించారు.

ఈ ఏడాది యాసంగిలో ప్రధానంగా బీపీటీ, తెలంగాణ సోనాతోపాటు వివిధ రకాల సన్నరకం వరి విత్తనాలను సాగు చేస్తుంటారు.

విత్తన శుద్ధి..

నారు పోసే ముందు విత్తన శుద్ధి చేస్తే పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించకుండా నివారించుకోవచ్చు. కిలో విత్తనాలను 2.5 గ్రాముల కార్బండిజంతో కలిపి 24 గంటలు నానబెట్టాలి. లేదా కిలో విత్తనాలకు 3 గ్రాముల కాప్టన్‌ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకుతినే పురుగు, ఉల్లికోడు, ముప్వ పురుగు ఆశించకండా ఉంటాయి.

నారుమడి తయారి

- నారు పోయాల్సిన మడిని 10–12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి.
- ఎకరా పొలం నాటడానికి 5 సెంట్లు (500 చ.మీ.) నారుమడి అవసరం. సెంటు భూమికి 5 కిలోల విత్తనాలు వాడాలి.
- 5 సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్‌ ఉండే ఎరువులు వాడాలి.

నారులో కలుపు నివారణ

- నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్‌ 1.5 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 7 లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారి చేయాలి.
- విత్తిన 15 రోజులకు సైహాలో పాస్‌ బ్యూటైల్‌ 10 శాతం మందు 400 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- విత్తిన 10 రోజుల్లో కార్బోఫ్యూరాన్‌ 3జీ గుళికలు సెంటు నారుమడికి 150 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనో క్రోటోపాస్‌ 1.6 మి.లీ మందును లీటర్‌ నీటిలో కలిపి విత్తిన 10 రోజులకు పిచికారి చేయాలి.
- జింక్‌ లోపాన్ని గమనిస్తే లీటర్‌ నీటిలో 2 గ్రాముల జింక్‌ పాస్ఫేట్‌ ద్రావణాన్ని పిచికారి చేయాలి. నారు 20–25 రోజుల వయస్సున్నప్పుడు 4 నుంచి 6 ఆకుల దశలో నాటుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుంది.


బిజ్జారం శివారులో యాసంగి కోసం వేసిన నారుమడి

చలి ప్రభావం నుంచి నారుమడి రక్షణ

యాసంగిలో చలి ప్రభావం నుంచి నారు మడుల్లో ఎదగక పోవటం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారడంతోపాటు కొన్నిసార్లు నారుమడి చనిపోతుంటాయి. ఇందుకు రైతులు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

నాటు వేసుకునే విధానం..

నాటు వేసే నారులో ఆకు లేతగా, ఆకుమచ్చగడ ఉంటే చేసు తొందరగా తిరుగబెడుతుంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటర్‌కు 44 దంట్లు(నారు మొలకలు) ఉండేలా నాటుకోవాలి.

- సాయంత్రం వేళలో నారుమడిలో నీరు తీసేసి పగటి పూట వెచ్చటి నీరు పెడుతుండాలి.
- రోజు సాయంత్రం అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్‌ షీట్‌ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.
- జింక్‌ లోపం వలన ఆకులుపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్‌ సల్ఫేట్‌ను లీటర్‌ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.

వైద్యరంగంలో ఏపీ నంబర్ వన్

దేశంలోనే ఏపీ ఆస్పత్రులకు అత్యధికంగా 3,161 కాయకల్ప అవార్డులు

సాక్షి, అమరావతి: ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు, వైద్యుల అందుబాటు, శానిటేషన్, ఇతర సదుపాయాల కల్పనపై సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం తొలినుంచీ ప్రత్యేక దృష్టి పెడుతూ వస్తోంది. ఇందులో భాగంగా నాడు–నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖల్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్వచ్ఛత, పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. దేశంలోనే కాయకల్ప గుర్తింపు కలిగిన అత్యధిక ఆస్పత్రులు ఏపీలోనే ఉండటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ విషయాన్ని ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ పార్లమెంట్‌లో వెల్లడించింది. 2022–23లో దేశవ్యాప్తంగా 20,336 ప్రభుత్వ ఆస్పత్రులకు ఈ అవార్డులను కేటాయించారు. ఇందులో 3,161 ఆస్పత్రులకు అవార్డులు పొందిన ఆంధ్రప్రదేశ్ దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. 2,619 ఆస్పత్రులతో తమిళనాడు రెండో స్థానంలో, 2,414 ఆస్పత్రులతో ఒడిశా మూడో స్థానంలో నిలిచాయి. తెలంగాణలో 734, కర్ణాటకలో 371, కేరళలో ఆస్పత్రులకు మాత్రమే అవార్డులు లభించాయి. ఇదిలా ఉండగా ఆస్పత్రుల్లో జాతీయ స్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటించే విభాగంలోనూ ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. 2022–23లో దేశవ్యాప్తంగా 2,041 ఆస్పత్రులకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాష్) లభించగా.. ఇందులో 18 శాతం ఆస్పత్రులు ఏపీ నుంచి ఉన్నాయి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

23న తిరుమలలో 'అఖండ పారాయణం'

తిరుమల: డిసెంబర్ 23న వైకుంఠ ఏకాదశి, గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల నాదనీరాజనం వేదికపై సంపూర్ణ భగవద్గీత అఖండ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో 700 శ్లోకాలను పారాయణం చేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. ఇందులో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద వర్సిటీ అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత వర్సిటీకి చెందిన శాస్త్రీయ పండితులు, టీటీడీ వేదపండితులు, శ్రీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు పాల్గొంటారు.

ఆరోగ్య ఉద్యానం!

పలాస 'వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి'లో అత్యున్నత వైద్య సేవలు: ఏపీ సీఎం జగన్

- రూ.700 కోట్లతో ఉద్దానానికి సురక్షిత మంచినీరు
- ఉచితంగా మందులు, పెంచిన పింఛన్లతో కిడ్నీ బాధితులకు ఆర్థిక చేయూత
- ఇదీ జగన్‌కు ఉన్న కమిట్‌మెంట్..
- ఉద్దానం కిడ్నీ సమస్యలపై గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం



శ్రీకాకుళం జిల్లా మకరాపురంలో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు స్వరూపాన్ని పరిశీలిస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉత్తరాంధ్రలో కిడ్నీ వ్యాధుల బాధితులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పలాసలో కొత్తగా నెలకొల్పిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలిసి పని చేస్తాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతాన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తూ రూ.700 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును కంచిలి మండలం మకరాంపురంలో సీఎం జగన్ గురువారం తొలుత ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం రూ.85 కోట్లతో పలాసలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ బాలుర వసతి గృహాన్ని వర్చ్యువల్‌గా ఆరంభించారు. నూతన పారిశ్రామికవాడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలాస రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు.

మాట నిలబెట్టుకున్న మీ బిడ్డ..

2018 డిసెంబర్ 30న ఇదే పలాసలో మాటిచ్చా. దేవుడి దయతో, మీ అందరికి చల్లని దీవెనలతో మన ప్రభుత్వం ఏర్పడ్డాక ఇక్కడే 200 పడకలతో కిడ్నీ రీసెర్చ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తెస్తా మని చెప్పా. కిడ్నీ సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా అడుగులు పడతాయని కూడా చెప్పా. 2019 సెప్టెంబర్‌లో రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రిని మంజూరు చేశాం. ఉద్దానం ప్రాంతానికి సురక్షిత మంచి నీటిని తెచ్చేందుకు హిరమండలం రిజర్వాయర్ నుంచి పైపులైన్లు వేసి ఇంటింటికి తాగునీరు అందించేందుకు 2020 సెప్టెంబర్‌లో సుజలధార పథకం మంజూరు చేశాం.

ఫిబ్రవరిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందించేలా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఇక్కడి కిడ్నీ రీసెర్చ్, సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి పని చేస్తుంది. ఈ ఆస్పత్రిలో డయాలసిస్ బెడ్లు, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగంలో ఐసీయూ బెడ్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ ఫిబ్రవరిలోనే ఇక్కడ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ (మూత్రపిండాల మార్పిడి చికిత్స) కూడా జరుగుతుంది. అత్యాధునిక సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, యూరాలజీకి అవసరమైన హోల్మియం లేజర్, యూరో డైనమిక్ మిషన్ లాంటి సదుపాయాలన్నీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఎక్కడికో పరుగెత్తాల్సిన అవసరం లేకుండా మన ప్రాంతంలోనే బ్రహ్మాండమైన వైద్యం అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఈ రోజు పలాసలో ఉంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బాధిత కుటుంబాలు ఎలా జీవిస్తున్నాయి? డయాలసిస్ కోసం ఎంత ఖర్చు అవుతోంది? వాటిని భరించలేక వారంతా ఎలా ఇబ్బందులు పడుతున్నారో తెలిసిన ప్రభుత్వంగా మీ బిడ్డ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పెన్షన్ పెంచాడు. రూ.2,500 మాత్రమే ఉన్న పెన్షన్‌ను మీ బిడ్డ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకంగా రూ.10 వేలకు పెంచాడు.

శాశ్వత పరిష్కారం దిశగా..

ఉద్దానం ప్రాంతంలో అసలు కిడ్నీ సమస్యలు ఎందుకొస్తున్నాయి? మూల కారణం ఏమిటని తెలుసుకొనేందుకు మీ బిడ్డ ఆరాటపడ్డాడు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐసీఎంఆర్‌తో పాటు జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేపట్టింది. 4 దశల్లో సాగే ఈ అధ్యయనంలో ఇప్పటికే మూడు దశలు పూర్తయ్యాయి. ఉద్దానంలో ఒక్క కిడ్నీ ఆస్పత్రితోనే సరిపుచ్చకుండా సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎవరి ఊహకూ అందని విధంగా రూ.700 కోట్లు ఖర్చు చేసి మరీ హిరమండలం నుంచి పైపుల ద్వారా నీళ్లు తెచ్చి ఈ ప్రాంతానికి మంచి చేసేలా అడుగులు వేశాం. ఇదీ మీపట్ల మీ జగన్‌కు ఉన్న కమిట్‌మెంట్. ఈ కమిట్‌మెంటే గత పాలకులకు, మనకు మధ్య తేడాను చూపిస్తుంది.

ఏపీలో అవ్వాతాతల పింఛను రూ.3వేలకు పెంపు

తుది ఆమోదం కోసం నేటి కేబినెట్ సమావేశం ముందుకు..

సాక్షి, అమరావతి: అవ్వాతాతలతో పాటు వితంతు, ఒంటరి మహిళ, వివిధ రకాల చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించనుంది. వీరికి ప్రతినెలా ఇచ్చే సామాజిక పింఛను మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల తుది ఆమోదం ఫైలు శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముందుకు రానుంది. నిజానికి.. 2024 జనవరి నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.3,000కు పెంచనున్నట్లు సీఎం నెలన్నర క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా పింఛన్ల పంపిణీ కోసం రూ.1,800 కోట్లకు పైగా ఖర్చుచేస్తుండగా.. జనవరి నుంచి జరిగే పెంపు అనంతరం అది రూ.2,000 కోట్లకు పెరిగే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ డిసెంబరులో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 65,33,781 మంది లబ్ధిదారులు పింఛన్లు పొందారు.

ఏఏజీగా తేరా రజనీకాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం ఆ బాధ్యతలను తప్పించే వరకు ఆయన ఈ పోస్టులో కొనసాగుతారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రజనీకాంత్ అత్యంత సన్నిహితుడు. గత ప్రభుత్వ హయాంలో అనేక అంశాలపై రేవంత్‌రెడ్డి హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసి న్యాయపోరాటం చేశారు. రేవంత్ తరఫున రజనీకాంత్ ఆ వ్యాజ్యాల్లో వాదనలు వినిపించారు. ముఖ్యమైన కేసులన్నీ కూడా రజనీకాంత్‌తో చర్చించేవారు. రజనీకాంత్ 45 ఏళ్లకే అదనపు ఏజీగా అవకాశం దక్కింది. తెలంగాణ, ఏపీ, ఉమ్మడి హైకోర్టులలో చూసినా అతిపిన్న వయసులో ఏఏజీ బాధ్యతలు చేపడుతున్న న్యాయవాదిగా తేరా రికార్డు కెక్కనున్నారు. తెలంగాణ హైకోర్టు ఏర్పడిన తర్వాత రెండవ ఏఏజీగా వ్యవహరించనున్నారు. రజనీకాంత్ స్వస్థలం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పిన్నవూర. ఉస్మానియా వర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. 2004లో న్యాయవాదిగా హైకోర్టులో ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి ఏపీలో 200లకు పైగా, తెలంగాణ హైకోర్టులో 300పైగా కేసులు వాదించారు. హైకోర్టులో ఏపీ జెన్‌కో స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2019లో హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యదర్శిగా గెలిచారు. పలు ట్రిబ్యునళ్ల తరఫున న్యాయవాదిగా కూడా వ్యవహరించారు.

జీఓ 87 అమలుపై స్టే ఇవ్వలేం

- విశ్వబలిజ కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు భూ కేటాయింపుపై హైకోర్టు విచారణ
- కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కుల సంఘాలకు తక్కువ ధరకు భూ కేటాయింపుపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రెవెన్యూ భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి, భూ పరిపాలన చీఫ్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌లతో పాటు విశ్వబలిజ కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ అభ్యంతరాలపై నాలుగువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణ వాయిదా వేసింది. భూకేటాయింపు జీఓపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం విశ్వబలిజ కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని సర్వే నంబర్ 41/40లో 6.35 ఎకరాలను రూ.100 చొప్పున (ఎకరం) కేటాయిస్తూ 2023, ఆగస్టు 2న రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 87ను జారీ చేసింది. దాదాపు రూ.100 కోట్లు విలువచేసే ఎకరం భూమిని రూ.100 చొప్పున కేటాయించారంటూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, మానవహక్కుల కార్యకర్త సుంకర నరేశ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అత్యంత విలువైన భూమిని చౌకగా కేటాయించడం సరికాదని పిటిషనర్ తరఫు న్యాయవాది శశికిరణ్ వాదించారు. జీఓ అమలును నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని కోరారు. ఆలిండియా వెలమ సంఘానికి ఖానామెట్‌లో 5 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓపై ఇదే హైకోర్టు స్టే ఇచ్చిందని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశించిందన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూములకు సంరక్షణగా మాత్రమే ఉంటుందని, అటువంటి భూములను అన్నివిధాలా పరిరక్షించాలని, కుల ప్రాతిపదికన భూ కేటాయింపు సుప్రీం కోర్టు ఉత్తర్వులకు విరుద్ధమని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులు వాదన వినకుండా స్టే ఇవ్వలేమని చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

విశాఖ ఇండస్ ఆస్పత్రిలో భారీ అగ్నిప్రమాదం

దాబాగార్డెన్స్(విశాఖ): జగదాంబ జంక్షన్ సమీపంలోని ఇండస్ హాస్పటల్లో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పోలీసులు, అగ్నిమాపక, జీవీఎంసీ సిబ్బంది చేపట్టిన ముమ్మర సహాయక చర్యలతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే కొంతమేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఆస్పత్రి రెండో అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. మండే స్వభావం గల నైట్రస్ ఆక్సైడ్ లీక్ అయినట్టు ప్రాథమిక అంచనా వేసినట్టు ఆర్డీవో తెలిపారు. మిగిలిన అంతస్తులకు మంటలు, పొగ వ్యాపించకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. విచారణ అనంతరం సీఎం జగన్‌కు నివేదిక పంపనున్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రి సిబ్బందితో పాటు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం.. చికిత్స పొందుతున్న పేషెంట్లను సమీపంలోని మెడికవర్, విజేత ఆస్పత్రులకు తరలించారు. 30 మందిని విజేత ఆస్పత్రికి, 17 మందిని మెడికవర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరు వెంటిలేటర్లపై ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

నెట్టెంపాడుకు ఒక పంపు ద్వారా నీటి విడుదల

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతలకు ఒక పంపు ద్వారా నీటి పంపింగ్‌ను కొనసాగిస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి గురువారం రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టుకు కేవలం 92 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పేర్కొన్నారు. నెట్టెంపాడుకు 750క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 65 క్యూసెక్కులు, కుడి కాల్వకు 401 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు.. ఇలా ప్రాజెక్టు నుంచి మొత్తం 1,955 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.810 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 325 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 250, క్యూసెక్కులు కుడి కాల్వ ద్వారా 10 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్ రెడ్డి తెలిపారు.

మాజీ సైనికులకు ఘన స్వాగతం

మరికల్: అయోధ్య నుంచి శ్రీలంక వరకు మాజీ సైనికులు చేపట్టిన సైకిల్‌యాత్ర గురువారం మండల కేంద్రానికి చేరుకోవడంతో బజరంగదళ్, వీహెచ్‌పీ, అఖిలపక్షం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ సైనికులు సాహెబ్‌రావు, శివ నారాయణ్ మిశ్రాకార్నర్, కులకర్ని సుబేదార్ మాట్లాడుతూ.. సైకిల్ యాత్రలో రోజుకు 75 నుంచి వంద కిలోమీటర్ల వరకు వెళ్తున్నట్లు తెలిపారు. గతేడాది నేపాల్ వరకు జరిగిన ఈ యాత్ర, ప్రస్తుతం శ్రీలంక వరకు కొనసాగుతుందని, లంకలో 18 రోజుల పాటు తిరిగి అయోధ్యకు చేరుకుంటామన్నారు. దేశ ప్రజలు సుఖ సంతోషలతో పాటు రైతులు మంచి పంటలు పండించి బాగుండాలని ఈ యాత్ర చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, రవి, పరశురాం, నవీన్‌గౌడ్, శ్రీరాములు, మధుగౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.



జాతీయ స్థాయిలో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్

- ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రీడలకు ప్రాధాన్యత
- కలెక్టర్ ఉదయ్‌కుమార్

అచ్చంపేట రూరల్: క్రీడల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 4వ జోనల్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. క్రీడాజ్యోతిని వెలిగించి జోనల్ క్రీడలను కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అచ్చంపేటలో మూడోసారి జోనల్ క్రీడలకు ఆతిథ్యమిస్తుందని అందుకు కృషి చేస్తున్న అధికారులకు, ప్రజా ప్రతినిధులను ఆయన అభినందించారు. విద్యార్థులను పోటీ ప్రపంచంలో ముందుకుసాగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలిపారు. ఏడు జిల్లాల నుంచి వచ్చిన బాల, బాలికలు ఆత్మవిశ్వాసంతో ఆడి విజయం సాధించాలన్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే క్రీడా కార్యక్రమాలు ఉంటాయని, తను కూడా ప్రభుత్వ పాఠశాల విద్యార్థినేనని, క్రీడల ప్రాముఖ్యత ఎలా ఉంటుందో తనకు తెలుసునన్నారు. గ్రామీణ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను బయటకు తీసేందుకు జోనల్ స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రింగ్ బాల్, అథ్లెటిక్, ఇండోర్, బాస్కెట్‌బాల్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థి జోనల్ రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

పోటీల్లో పాల్గొన్న టీంలు...

నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, మహబూబ్ నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లా నుంచి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల నుంచి 1,657 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

వీరికి అండర్–14, 17,లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నీ కాయిట్, క్యారమ్స్, చెస్, లాంగ్‌జంప్, హైజంప్, హ్యాండ్‌బాల్‌తో పాటు అథ్లెటిక్ పోటీలు ఈనెల 14 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు నాగర్‌కర్నూల్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని భద్రాచలంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, తహసీల్దార్ శైలేంద్రకుమార్, డీటీడబ్ల్యూఓ కమలాకర్‌రెడ్డి, నల్లగొండ డీటీడబ్ల్యూఓ రాజ్‌కుమార్, సూర్యాపేట డీటీడబ్ల్యూఓ శంకర్, ఏటీడబ్ల్యూఓ లక్ష్మారెడ్డి, ఎంఈఓ రామారావు, సీఐ అనుదీప్, మల్లేష్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కొనసాగుతున్న ఆర్‌యూబీ పనులు



పుషింగ్ పనుల్లో భాగంగా రైల్వే లైన్ కిందకు వచ్చిన బ్లాగ్స్

జడ్చర్ల టౌన్: పుర పరిధిలోని రైల్వేస్టేషన్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఓ వైపు బ్లాగ్స్ 20 అడుగుల మేర పుషింగ్ పూర్తయింది. బ్లాగ్స్‌ను రైల్వేలైన్ కిందకు తరలించే కార్యక్రమానికి గత నెల 28, 29 తేదీల్లో ట్రయల్‌రన్ నిర్వహించిన విషయం తెలిసిందే. 16.5 అడుగుల వెడల్పుతో మొత్తం 12 మీటర్లు (40 అడుగులు) బ్లాగ్స్ నిర్మించారు. సోమవారం ప్రారంభమైన పుషింగ్ పనులు గురువారానికి 22 అడుగుల మేర పూర్తిచేశారు. వాహనాల రాకపోకలకు దారి ఏర్పాటు చేస్తున్నారు. నిపుణుల పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుషింగ్ చేస్తున్నారు. పుషింగ్ పనులు కొనసాగుతుండటంతో స్టేషన్ వద్ద రైళ్ల వేగం నియంత్రించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో హవా మాదే..

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



మాట్లాడుతున్న డీకే అరుణ

నారాయణపేట రూరల్/కృష్ణా: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. కృష్ణా వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఆర్‌పీఆర్ అతిథిగృహంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన కుటుంబం విలువలతో కూడిన రాజకీయాలు చేస్తుందని, అనవసరంగా తప్పుడు మాటలు మాట్లాడే వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పార్టీదే పైచేయిగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో మెజార్టీ స్థానాల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని కాంగ్రెస్ అసత్య ఆరోపణలు చేసిందన్నారు. అయినప్పటికీ బీజేపీకి ఓటు శాతంతో పాటు సీట్లు కూడా పెరిగాయని గుర్తు చేశారు. కార్యకర్తలు నిరుత్సాహపడకుండగా రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, కొండయ్య, సోమశేఖర్‌గౌడ్, అమర్‌కుమార్ దీక్షిత్, నర్సప్ప, రాఘవేంద్ర, ఎంపీటీసీ వెంకటేష్, సురేష్, శక్తిసింగ్, మంజునాథ స్వామి, ఆంజనేయులు ఉన్నారు.

కురుమూర్తి హుండీ ఆదాయం రూ.66.04 లక్షలు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలతోపాటు జాతర ఉత్సవాలు నెలరోజులపాటు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలకు తెలంగాణతోపాటు ఆంధ్ర, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి సుమారు 10 లక్షల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో భక్తులు స్వామివారికి మొక్కుబడిగా వివిధ రకాల కానుకలు సమర్పించుకున్నారు. కానుకల హుండీని ఆలయ అధికారులు నెలరోజులకు గాను మూడు దఫాలుగా లెక్కించారు. మొదటిసారి హుండీ ఆదాయం రూ.20,69,089 ఆదాయం రాగా.. రెండోసారి రూ.27,47,855, గురువారం మూడోసారి రూ.17,87,463 వచ్చింది. దీంతో ఈ ఏడాది ఉత్సవాలను కలుపుకొని మొత్తం హుండీ ఆదాయం రూ.66,04,407 వచ్చిందని ఆలయ ఈఓ మదనేశ్వర్ రెడ్డి తెలిపారు. గతేడాది జాతర పురస్కరించుకొని హుండీ ఆదాయం రూ.71,93,678 రాగా.. ఈసారి రూ.5,89,271 తక్కువ వచ్చినట్లు ఈఓ తెలిపారు.



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి



ఛలో ఢిల్లీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డా. పిడమర్తి రవి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణతో పాటు జనాభా దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. పిడమర్తి రవి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఛలో ఢిల్లీ కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 18, 19 తేదీల్లో చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లాలోని మాదిగ యువకులు, మహిళలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్, నాయకులు రాయికంటి రాందాస్, గడ్డమీది గోపాలకృష్ణ, ప్రవీణ్‌కుమార్, మిట్ట యాదయ్య, జుట్ల రవికుమార్, కొమ్ము జాన్సన్‌బాబు, శ్రీనివాసులు, రాజీవ్‌గాంధీ, అశోక్, ప్రసాద్, అరుణ్‌కుమార్, రామలింగం, వెంకట్రాములు, కృష్ణ, రావుల కృష్ణ, నర్సింహులు, మొగులయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.